ఆశ్రమం సందడిగా వుంది. నిత్యానందాశ్రమానికి ఆరోజు చాలామంది భక్తులు , సందర్శకులూ వచ్చారు. నిత్యానందస్వామి రోజూ ఇచ్చే ఉపన్యాసం ఇంకా ప్రారంభం కాలేదు. ఆధ్యాత్మికోపన్యాసానికి రోజూ వందలాది గాకపోయినా వందమంది వరకు శ్రోతలు హాజరౌతారు.




ఆరోజు సంఖ్య బాగా పెరిగింది.

ప్రక్క గ్రామంలో తిరునాళ్ళు వుండడం కూడా అందుకు ఒక కారణం. జనాన్ని ఒత్తిగించుకుంటూ తివారీ ముందుకు నడిచాడు. చెట్లకింద, పర్ణశాల ముందూ, ప్రసంగం ఇచ్చే వేదిక ముందూ జనం చేరి మాట్లాడుకుంటున్నారు.

నిత్యానందస్వామి చాలా విగర్వి. ఆయన చిత్రపటం ఎక్కడా వుండదు.

ఆధ్యాత్మికపు లోతులు తరచి తరచి చూసినవాడు!

ప్రసంగం ఇచ్చే పది నిమిషాలు తప్ప మిగతా రోజంతా నిశ్శబ్దం! భక్తులు కేవలం తమ ఉబలాటం కొద్దీ ఆయనకి కొన్ని సౌకర్యాలు సమకూర్చారు. అంతే!

తివారీ వింటున్నాడు.

నిత్యానందస్వామితో తనకు పరిచయం లేదు. కాని ఆయన్ని ఎక్కడో ఎప్పుడో చూసినట్టు తోస్తోంది. క్రితం రోజునాటి ఆధ్యాత్మిక ప్రసంగానికి హాజరయ్యాడు తివారీ.

నిత్యానందుడి కదలికలూ, మాట తీరు, ముక్కుపుటాలు కనుబొమలు కదిల్చే తీరు ఎక్కడి కక్కడ పరిచయమైనవిగా తోస్తున్నాయి.

నిత్యానందస్వామితో తన పరిచయం ఎక్కడ జరిగింది? ఆయనదే వూరు? ఎక్కడినుంచి ఇక్కడికి వచ్చాడు? తనకు మాత్రం ఈ ప్రాంతం రెండు రోజుల క్రితం వరకు కొత్త!

జనంలో కదలికలూ హడావుడీ ఎక్కువయ్యాయి. వాళ్ళు వేదిక వద్ద చేరి చాపల మీద చతికిలపడుతున్నారు. ఉదయం సరిగ్గా ఎనిమిది గంటలవుతోంది.

చక్కగా ఉతికిన ధోవతీ అంగవస్త్రం ధరించి నిత్యానందస్వామి వేదిక మీద ప్రత్యక్షమయ్యాడు.

ఆయన మొహంలో నిర్లిప్తత!

శ్రోతలను చూపుల్తో పలకరించి ప్రసంగం ప్రారంభించాడు నిత్యానందస్వామి.

"అణ్వాస్త్రం కంటే అంతరాత్మ చాలా బలమైంది. మనిషిని సమూలంగా కాల్చుకు తింటుంది అంతరాత్మ. ఎప్పుడెప్పుడో చేసిన పాపాలూ తప్పులూ అంతరాత్మ బయటపెట్టి కొలిమిలో ,బంగారాన్ని కాల్చి శుద్ధి చేసినట్టు మనిషిని శుద్ధి చేస్తుంది..."

అక్షరం అక్షరం స్ఫుటంగా మెదడుమీద ముద్ర పడుతోంది. శ్రోతలు మౌనంగా వింటున్నారు. అక్షరాల కూర్పులో సంఘటనల చిత్రీకరణ, అనుభవాల సారాంశం స్వామి మాటల్లో పొదుగుకుంటూ శ్రోతల నాకట్టుకుంటున్నాయి.

"...శుద్ధి చేయగా చేయగా బంగారమే మిగలదు. మనసు మనిషిని కాల్చగా మనిషి మిగలడు......"

సమయం పది నిమిషాలు దాటుతోంది.

అయినా స్వామి ప్రసంగం ఆగలేదు. ఆనవాయితీ దాటిపోయి గంగాప్రవాహంలాగా సాగిపోతోంది. స్వామి చూపు చుట్టూ తిరిగి, తివారీ మీద నిలబడిపోయింది. మాట్లాడుతూనే ఒకసారి చెయ్యిచూపి తివారీని తన వద్దకు రమ్మన్నట్టు చెయ్యి చాపాడు నిత్యానందస్వామి.

ఉలిక్కిపడ్డాడు తివారీ.

ఒకసారి చుట్టూ బిడియంగా చూసుకున్నాడు. లేచి మెల్లగా వేదికవైపు కదిలాడు.

నిత్యానందస్వామి ఒక జ్వాలాతరంగం లాగా ప్రకాశిస్తున్నాడు.

"జ్వాల తర్వాత మిగిలేది బూడిదే-"? కొనసాగించాడు నిత్యానందస్వామి. ఆయన కథనంలో ఒక కథే వుంది.

సగటు భారతీయుడి కథే అది!

సుబ్బారావు పేరు చెబితే ఎవరూ జార్జ్ బుష్ గురించి, వైట్‌హౌస్ గురించీ ఊహించుకోరు. రెక్కాడితేనే డొక్కాడే అతిసామాన్యుడే సుబ్బారావు. సుబ్బారావు భార్య అచ్చగా సుబ్బలక్ష్మి కాదుగాని పార్వతి! సుబ్బారావుకీ పార్వతికీ ఇద్దరే ఇద్దరుపిల్లలు!

మొదటి సంతానం కామేశ్వరి!

రెండో సంతానం అబ్బాయి!

నిత్యానందుడి కథనంలో సుబ్బారావు రెండో సంతానాని కంత ప్రాధాన్యత లేదు. అందుకే అతడికి పేరు లేదు. సుబ్బారావు కొడుకు!!! అంతే!

కామేశ్వరి పెళ్ళి కెదిగింది. ఆమె నిజంగానే సుబ్బారావు గుండెలమీద కుంపటయ్యింది. సంబంధాలు వెతుక్కుంటున్నారు సుబ్బారావు దంపతులు.

బీద ఇంటి పిల్లకు అంత సులువుగా పెళ్ళయిపోతే ఇంకేముంది! సంబంధాలు వస్తున్నాయి. పోతున్నాయి.

పిల్ల బాగానే వుంది! కట్నం లేదు! పిల్ల వెనుక ఆస్తిపాస్తుల్లేవు. పిల్ల ఒంటిమీద బాల తొడుగు లేదు.

ఇక ప్రశ్నల మీద ప్రశ్నలు!

ఆడపడుచు కట్నం ఎంత ఇస్తారు!

పెళ్ళికొడుక్కి లాంఛనాలు తీరుస్తారా!

ఉద్యోగం వేయించుకుంటారా! పోనీ మేమే వేయించుకుంటాం, ఖర్చు మీరు భరిస్తారా!

ఒక ప్రశ్న కాదు, ఒక లోకం కాదు. ఈ ఆడపిల్లను ఎందుక్కన్నామా అని తల్లి దండ్రులు కుమిలి కుమిలి ఏడవ్వలసిన పరిస్థితి!

నిజంగానే అంత పనీ రోజూ చేస్తూనే వున్నారు సుబ్బారావు, పార్వతీ.

పార్వతికి గుండె జబ్బు పట్టుకుంది. సిరి అబ్బదు కాని చీడ సులువుగా అబ్బుతుంది. కామేశ్వరికి సంబంధాలు వెతకడం అందులోను వాటిలో బీద సంబంధాలు ఎంచుకోవడంతో పాటు పార్వతికి వైద్యం చేయించడం, మందులు మాకులూ మింగించడం వాటితో పాటు వూళ్ళు తిప్పడం తప్పనిసరయ్యింది.

"చచ్చిపోయేదాన్ని నాకెందుకు వైద్యం! పిల్లదానికి సంబంధం చూడండి ముందు!" అనేది పార్వతి.

సుబ్బారావు విరక్తిగా నవ్వేవాడు.

చూస్తూ చూస్తూ నిండు ప్రాణాన్ని బలిపెట్టగలమా! అందులోను తనకోసమే జీవితం అర్పించుకున్న భార్య! ఇటు కూతురును ఒక అయ్య చేతిలో వుంచలేకపోతున్నాడు. అటు భార్యకు సంతృప్తికరంగా వైద్యం చేయించలేకపోతున్నాడు.

తనే చచ్చిపోతే అసలు సమస్యలే వుండవు.

ప్రపంచంలో అందరూ బతికివుండే సమస్యలను పరిష్కరిస్తున్నారా! లేదు... మృత్యువు కూడా కొన్ని కొన్ని సమస్యలను పరిష్కరిస్తుంది.

ఈ పరిస్థితుల్లోనే పార్వతి అడిగింది.

"నా పేరున భీమా పాలసీ తీసుకోవలసింది!"

సుబ్బారావు తెల్లబోయాడు.

"మనిషి చచ్చిపోతే పాలసీ డబ్బు మొత్తం చెల్లిస్తారట కదూ!"

"అంటే-" సుబ్బారావుకు ఆమె ప్రశ్న మింగుడుపడలేదు.

"ఆ డబ్బుతో కామేశ్వరి పెళ్ళి చేయవచ్చు!"

"ఏ డబ్బు?"

"నాకు భీమా చేయించండి! నేనెటూ ఇక బతకను. చచ్చిపోతాను. ఈ పద్ధతిలో తప్పించి కామేశ్వరికి పెళ్ళికాదు!"

"షటప్..." అరుస్తూనే సుబ్బారావు కుప్పకూలిపోయాడు.

పార్వతి అతడి మొహాన నీళ్ళు చల్లి లేపింది.

"నేనింకా బతికేవున్నానా!" అన్నాడు సుబ్బారావు.

ఆ రాత్రినుంచే పార్వతికి రోగం తిరగబెట్టింది.

"నా గురించి మీరెందుకు బెంగ పెట్టుకోవడం! పెళ్ళి చేసుకోవడం ఒక్కటేనా ఆడదాన్ని నడిపించేది... మీ ఇద్దరి ఉసురూ పోసుకుని పెళ్ళి చేసుకుని మాత్రం నేనేం సుఖపడతాను! చేతిపని నేర్చుకుని ఇంట్లో వుండిపోతే మీ కభ్యంతరమా!" అంది కామేశ్వరి.

కుర్రదాని మాటల కింద కొట్టిపారేశారు భార్యాభర్తలు.

కూతురెంత ఎదిగినా ఇంకా కుర్రదే!

విశాఖపట్నం తీసుకుపోయి స్పెషలిస్టుకి చూపించమన్నాడు వైద్యుడు. చప్పన్న పరీక్షలూ చేసి ఆరేడు వందల రూపాయిలు తగలబెట్టించి మరీ చావు కబురు చెప్పాడు వైద్యుడు.

వైజాగ్‌లో పనికిమాలిన ఎక్స్‌రేలు, అవసరం లేని రక్తపరీక్ష, మూత్ర పరీక్ష, ఎలక్ట్రో కార్డియోగ్రాఫ్- అన్నీ చేయించి నిపుణుడు మరో వెయ్యి వదలగొట్టించి మరీ పెదవి విరిచాడు.

అంతులేని జలరాశి కాళ్ళను తాకుతుంటే ఒంటరిగా ఎడారి అంచున నిలబడినట్టే అయ్యాడు సుబ్బారావు.

పార్వతి మొత్తుకుంటూనే వుంది.

"నాకెందుకీ డబ్బు దండగ, చచ్చేదానికి! మీకెందుకు అప్పుల బాధ! ఎవరిని పోషించాం? పదండి... ఇక ఇక్కడెందుకు? పచ్చగడ్డ పచ్చడి చేస్తే ఇక్కడ ఎగబడిపోయి కొనుక్కునే పరిస్థితి! యమలోకం లాంటి మెడికల్ సెంటర్లు!" అంది పార్వతి.

టికెట్ ఖర్చు తక్కువని పాసింజరెక్కారు భార్యాభర్తలు.

అతికష్టంమీద ప్లాట్‌ఫాంని వదిలిపెట్టి బయల్దేరింది పాసింజరు. దాని నడక కూడా ఎడ్ల బండి నడక!

"నాలుగో బెడ్ మీదుంది చూశారా! ఆవిడకు ఈ మధ్య భర్త పోయాడట!" అంది పార్వతి.

కిటికీలోంచి గాలి కూడా మెల్లగా వీస్తోంది.

సుబ్బారావు తలూపాడు.

"రైలు దిగుతూ పడిపోయాడట. కవుకు దెబ్బలు తిని ఆస్పత్రిలో పోయాడట!" నిట్టూర్చింది పార్వతి.

"మంచి వైద్యం చేయించుకుంటోంది లెండి!"

"ఆస్తిపరులు కాబోలు" సుబ్బారావుకు గొంతు పట్టేసింది.

ఈ సమాజంలో మనిషికీ మనిషికీ ఎన్ని తేడాలు! ఆరుద్రగారన్నట్టు ఈ ఇంట్లో కోడి పలావు! పక్కింట్లో పస్తుల చావు!

పార్వతి మొహంలో వున్నట్టుండి వెలుగు ప్రత్యక్షమయింది.

"రైల్వే వాళ్ళు డబ్బిచ్చారట!"

"ఎందుకు?"

"భీమా డబ్బట!"

భార్య మొహంలోకి తీక్షణంగా చూశాడు సుబ్బారావు.

"మనం కొనే ప్రతి టిక్కెట్ మీదా 'భీమా' వుంటుందట కదా!"

గాలిలో తేమ పెరుగుతోంది. ఎక్కడో జల్లు పడుతున్నట్టుంది. వుండి వుండీ ఒక్కొక్క వర్షపు చుక్క చేతిమీద పడుతోంది.

పార్వతి మాటలు సుబ్బారావుకు అర్థం కావడం లేదు.

ఏం మాట్లాడుతోంది పార్వతి? విశాఖపట్నం వైద్యానికి బయల్దేరక ముందు కూడా భీమా విషయం ఎత్తింది పార్వతి.

"ఆ సంగతులన్నీ నీకెందుకు?" అరిచాడు సుబ్బారావు.

పార్వతి నిర్లిప్తంగా చూసింది. భర్త చేతిని తన చేతిలోకి తీసుకుంది.

"అమ్మాయికి పెళ్ళి చేసెయ్యండి" అంది గద్గదంగా.

"అదేమిటి పార్వతీ! తెలియనట్టు మాట్లాడతావ్! సంబంధాలు వెతకడంలేదా! కుదిరితే బాగుండుననే కదా చూస్తున్నాం!"

"మీరొక్కరే చూడండి... నాకు కుదరదు."

"ఎందుకు కుదరదు! నీకు నయమవుతుంది. నీ మాట లేకుండానా సంబంధం ఖాయం చేయడం? అయినా డబ్బు చూసుకోవాలి కదా!"

బయట వర్షపు జల్లు ప్రారంభమయింది.

అక్కడో యిల్లూ, ఇక్కడో ఇల్లూ, పొలం గట్టునో పశువుల పాకా కనిపిస్తున్నాయి. ప్రయాణికులు తమ సామాన్లు చూసుకుంటున్నారు.

"వచ్చేది అన్నవరమా!"

"ఆ!"

ప్రయాణికులు మాటలాడుకుంటున్నారు. పార్వతి అదేమీ పట్టించుకోవడం లేదు. భర్త మొహంలోకే చూస్తుండిపోయింది.

"డబ్బు రాగానే అమ్మాయి పెళ్ళి... సరేనా!" పార్వతి లేచింది. లేస్తూనే భర్త చేతిని మెల్లగా నొక్కింది.

"ఎక్కడికి?" అడిగాడు సుబ్బారావు.

"ఒక్కసారి..."

"నీళ్ళగదిగా! వెంట రానా?"

"వద్దండి! శ్రమ!"

సుబ్బారావు లేచాడు. పార్వతి బలవంతం మీద కూర్చోబెట్టింది. "మీరుండండి. ఈ ఒక్కసారికీ నన్ను వెళ్ళనివ్వండి." అంటూ నడవాలో మాయమయింది.

సుబ్బారావు బయటకు చూశాడు.

పార్వతి మాటల కర్థమేమిటి? డబ్బు రాగానే అమ్మాయి పెళ్ళి- మీరుండండి, ఈ ఒక్కసారికీ నన్ను వెళ్ళనివ్వండి- మీరొక్కరే చూడండి, నాకు కుదరదు—

"పార్వతీ" అరిచాడు సుబ్బారావు.

కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణికులు తెల్లబోయారు. ప్లాట్‌ఫాం సమీపిస్తోందేమో- ఎవరు ఏం చేస్తున్నారో వారికి మాత్రమే తెలుసు! ఇతరుల విషయాలు పట్టవు. అయినా సరే వారంతా ప్రక్కకి తప్పుకుని దారిచ్చారు. సుబ్బారావు తన భార్య వెళ్ళిన వైపే పరుగెత్తాడు. దిగడానికి సిద్ధమైపోయిన ప్రయాణికులను ప్రక్కకు తప్పించుకుని గుమ్మంలో ఒంటరి విగ్రహంలాగా నిలబడింది పార్వతి.

పాసింజర్ రైలు సిగ్నల్ స్తంభం దాటి ప్లాట్‌ఫాం ప్రక్కనే పరుగెత్తుతోంది.

"పార్వతీ!" పిలిచాడు సుబ్బారావు.

పార్వతి వెనక్కి తిరిగి చూడలేదు.

సత్తువ మొత్తం కాళ్ళలో కేంద్రీకరించుకుని గాల్లోకి ఉరికింది. ఏం జరిగిందో తెలుసుకునే లోగా ఎడ్లబండి నడకతో పాసింజర్ ముందుకు వెళ్ళిపోయింది.

సుబ్బారావు మైకం కమ్మి కిందపడిపోయాడు.

తిరిగి ఆస్పత్రిలోనే కళ్ళు తెరిచాడు. రైల్వే తరపున చెక్కు పట్టుకుని తివారీ తన వద్ద నిలబడి వుండడం చూశాడు.

అంతే!

మరల కళ్ళు తిరిగినట్టయి స్పృహ కోల్పోయాడు.

—నిత్యానందుడి కథ ఆగిపోయింది. దీనంగా చుట్టూ చూశాడు. తిరిగి తివారీ మీద చూపులు నిలబెట్టాడు.

"నా భార్యకిచ్చిన మాట ప్రకారం అమ్మాయి పెళ్ళి చేశాను. నా భార్య ఆత్మాహుతితో సమస్యలోంచి బయటపడ్డానన్న పాపం నన్ను తినేస్తోంది. వైరాగ్యంతో దేశాలు పట్టాను. ఎవరో నన్ను నిత్యానందుడన్నారు. పందిరి వేశారు. ఇక్కడ కూర్చోబెట్టారు. కాని... నా అంతరాత్మ నన్ను నిలబడనివ్వదు... కూర్చోనివ్వదు. తివారీగారూ! నా భార్య ప్రమాదవశాత్తు చనిపోలేదని, ఆత్మహత్యతో చచ్చిపోయిందని మీకు తెలిసిపోయి వుంటుంది- రండి, పాపిని. నాకు ఉరిశిక్ష వేయండి!"

నిత్యానందుడు నేలమీద పడిపోయి గిలగిల కొట్టుకుంటున్నాడు. తివారీ ముందుకు వెళ్ళాడు. గద్గద స్వరంతో అన్నాడు.

"కామేశ్వరి భర్త రైలు ప్రమాదంలో పోయాడు... స్వామీ!"

నిత్యానందుడిలో చలనం ఆగిపోయింది అప్పటికే!